# అమ్మకూచి

మృణాళినీదేవిని చూడగానే అనుకున్నాను - ఈవిడెవరో గానీ మహాస్ట్రాంగ్ కారెక్టర్రా బాబూ అని. ఆవిడ స్ట్రాంగ్ అయినప్పుడు ఎదుటివాడు, ఈ సందర్భంలో వాళ్ల అబ్బాయి గోపాల్, వీక్ కారెక్టరవుతాడుగా! అలాగే అయ్యాడు. గోపాల్ని మొదటిచూపులోనే స్టడీ చేశా - వీడు అమ్మకూచిరా అని. వాళ్ల అమ్మపక్కనే కూచోవడం, ఆమెను సంతోషపెట్టడానికి పడే ప్రయాస, అంతా గమనిస్తే నేనే కాదు ఎవరైనా అంటారా మాట! ఎదుటివాడు తన కంత ప్రాముఖ్యత ఇస్తూ ఉంటే ఇవతలి వాళ్లు, ముఖ్యంగా మృణాళినీదేవి వంటి మహిళ, ఎలాటి భేషజానికి పోతుందో ఊహించుకోవచ్చు.

పనాజీలో, ఆ మారుమూల టూరిస్టు హోటల్లో బసచేసిన తెలుగువాళ్లం మేము మాత్రమే. పొద్దున్న బ్రేక్‌ఫాస్ట్ చేస్తూండగా వాళ్లు నా కంటబడ్డారు. ఆవిడని చూడగానే పోల్చుకున్నాను తెలుగావిడని. ఆవిడ మాత్రం నన్ను గమనించనట్టే ఫోజు కొట్టింది. తెలుగువాళ్లకు మామూలుగా ఉండే తెగులే కదా అని ఊరుకున్నాను. కానీ వాళ్ల అబ్బాయి మాత్రం బోళా మనిషిలా అనిపించాడు. నన్ను చూడగానే పరిచయం చేసుకోవాలనుకుని కూడా అమ్మను చూసి బెదిరేడేమో! మధ్యాహ్నం రిసెప్షన్‌లో టూరిస్ట్ లిటరేచర్ చూస్తూండగా దగ్గరికి వచ్చి పరిచయం చేసుకున్నాడు.

గోపాల్ తండ్రి చిన్నప్పుడే పోయాట్ట. తల్లే సర్వస్వం అయి పెంచిందట. ఆమె గీచిన గీటు దాటడట. పొలం, పుట్రా, ఇళ్లూ, వడ్డీ వ్యాపారం అన్నీ ఉన్నాయిట కానీ ఇప్పటికే ఆవిడదే అజమాయిషీ అంతా. ఇతనికి ఏ బాధ్యతా లేదు. ఆవిడ అప్పగించదుట. మనవాడికి వాళ్ల అమ్మ కొంగు పట్టుకుని తిరగడం తప్ప వేరే పని ఉన్నట్టు నాకు తోచకపోయినా 'లేదు, పొలం వ్యవహారాలన్నీ స్వయంగా నేను చూస్తాను. సుగర్ ఫ్యాక్టరీ పెడదామనుకుంటున్నాను. మెషినరీ గురించి వాకబు చేయడానికి బొంబాయి వచ్చి, ఇలా సరదాగా గోవా చూడ్డానికి వచ్చాం' అన్నాడు గోపాల్.

"మాది బట్టల వ్యాపారం. బొంబాయిలో మా మావయ్య ఇంట్లో దిగుతూంటాను. బట్టల మిల్లువాడు వారం రోజులు టైమడిగేడు కొత్త సరుకు ఇవ్వడానికి. మా మావయ్య కూతురు పురిటికి వచ్చింది. ఆ ఫ్లాట్‌లో నేను కూడా ఏం ఇరుకుతానని, ఆ వారం గోవా అంతా తిరుగుదామని వచ్చాను." అని నా పరిచయం ఇచ్చుకున్నాను.

మృణాళినీదేవి గారు నా గురించి కనుక్కుందో ఏమో, ఆవిడకి ఎందుకు నాతో మాట్లాడబుద్ధేసిందో గానీ మూడోరోజున పలకరించింది బీచ్‌సైడ్ కెఫేలో, "ఆంధ్రాలో మీ స్వంత ఊరు ఏది?" అంటూ చెప్పాను. ఆవిడ తన గాథ చెపుతుందేమో అనుకుంటూండగానే,

"చూసారా? మా గోపాల్ గర్ల్‌ఫ్రెండుని" అని అడిగింది. అతనూ, ఓ కొత్త అమ్మాయీ కలిసి వెళ్లిన దిక్కుగా తల ఎగరేస్తూ.

ఆవేళ ఉదయమే చూసాను ఆ అమ్మాయిని. తల్లీ కొడుకులతో బాటు బ్రేక్‌ఫాస్టు తీసుకుంది హోటల్లో. చక్కనిదే కానీ కాస్త మేకప్ ఎక్కువగా వేసుకున్నట్టనిపించింది. హావభావాలు కూడా టీవీలో కనబడే వీజేల పద్ధతిలో, హెచ్చుస్థాయిలో ఉన్నాయి. మధ్యలో గోపాల్ నాకేసి చూసి చిరునవ్వు నవ్వాడు కానీ పరిచయాలు చేయలేదు. నా దారిన నేను తిరిగి, బీచ్ కెఫేకి వచ్చి టీ తాగుతూండగా వీళ్లను మళ్లీ చూసాను. గోపాల్ పెద్దావిడతో ఏదో చెప్పి ఆ అమ్మాయితో బాటు సముద్రం కేసి

నడిచాడు. ఈవిడ కోక్ సీసా పట్టుకుని కూచుంది. ఐదు నిమిషాల తర్వాత ఏమనుకుందో ఏమో పనిగట్టుకుని మరీ నన్ను పలకరించింది.

"ఫ్యామిలీ ఫ్రెండా? ఇక్కడికి వచ్చాక పరిచయమైన ఫ్రెండా?" అని అడిగేను, ఎవరైనా నాకొకటే అయినా.

"విజయవాడలోనే తెలుసుట. నాకెప్పుడూ చెప్పలేదు. కావాలని ప్రోగ్రాం వేసుకుని గోవా వచ్చినట్టుగా అనిపిస్తోంది. ఇక్కడే పరిచయమయినట్టు యాక్ట్ చేయబోయారు గానీ నేను పదినిమిషాల్లో పసిగట్టేశాను. ఒప్పుకున్నారు." అంది ఆవిద గర్వంగానూ, కోపంగానూ.

"పోనీలెండి ఏదో కుర్రవయస్సు! వాళ్లకు కాకపోతే మనలాటి మిడిల్ ఏజ్‌వాళ్లకు వస్తాయా ఇలాటి ఐడియాలు! ఈడూ జోడూ బాగానే ఉన్నారు." అన్నాను వాతావరణానికి తేలికబరచడానికి.

కానీ ఆవిడా లొంగేది!? "ఆ అమ్మాయి నాకేం నచ్చలేదు. కనుముక్కు తీరు బాగానే ఉండవచ్చు కానీ అమ్మాయిలు అంత ఓవర్‌గా మేకప్ చేసుకుని, అలా గట్టిగా మాట్లాడితే నాకు నచ్చదు. అలాటివాళ్లు తగిలితే మా వాడు నిమిషాల్లో చెడిపోతాడు" అందామె ఆవేశంగా.

"ఆ అమ్మాయి గురించి ఇప్పుడు గొడవెందుకు? వదిలేయండి. మీ వాడికి ఆ అమ్మాయి నచ్చి, పెళ్లి చేసుకుందామనుకున్నప్పటి మాట కదా!"

"అనుకోవడం ఏమిటి? నాకు తెలియకుండా వాళ్లప్పుడే ఎంగేజ్‌మెంటు కూడా చేసేసుకుంటే!" అంటూ ఆవిడ ఆక్రోశించింది.

నేను నిర్ఘాంతపోయాను. ఈ తల్లీ కొడుకుల గురించి పెద్దగా తెలియకపోయినా గోపాల్ తెగించి ఇంత పని, .. తల్లి ఇష్టానికి వ్యతిరేకంగా... చేస్తాడని నేను అనుకోలేదు. ఇదంతా ఆ అమ్మాయి ప్రోద్బలమే అయివుంటుంది.

అదే ఆవిడా అంటోంది నా ధ్యాస ఆవిడవైపుకి మరలించేటప్పటికి. "ఇలాటి నంగనాచి మా అబ్బాయిని నా దగ్గర్నుంచి దూరం చేయదూ!" అంటూ వాపోయింది కూడా. "మీరెలాగైనా కలగజేసుకుని మా అబ్బాయికి నచ్చచెప్పాలి" అంటూ ప్రార్థించింది.

గొప్ప మనిషే! ఇన్నాళ్లూ పలకరించడానికి కూడా నేను పనికిరాకపోయాను. ఈ రోజు, వాళ్ల అబ్బాయి నాతో కాస్త చనువుగా మాట్లాడినట్టు కనబడగానే నన్ను ఉపయోగించుకుంటోంది. ఎంత తెలివితేటలు లేకపోతే భర్త పోయినా ఇంత ఆస్తి అజమాయిషీ చేసుకుంటూ వచ్చింది!

ఆవిడ అవకాశవాదం నాకు నచ్చకపోయినా, మంచి మాట చెపితే నష్టపోయేది ఏదీ లేదు కనక ఆ సాయంత్రం ఆ అమ్మాయి ఉంటున్న హోటల్‌రూమ్‌కి వెళ్లి కలిసాను. పేరు ప్రశాంతి. ఒక్కత్తీ వచ్చి ధైర్యంగా హోటల్లో దిగిందిట. బాగుంది, అత్తగారికి తగినదే అనుకున్నాను.

"నాకెందుకు భయం!? నాక్కాబోయే భర్త గోపాల్ దగ్గరే ఉండగా!" అంది. "మరి ఆ హోటల్లోనే ఉండలేకపోయావా?" అంటే, "మృణాళినీదేవి గారి తరహా నాకు నచ్చదు... అందుకని" అంది కుండ బద్దలు కొట్టినట్టు.

ఇది మరీ బాగుంది. గోపాల్ కావాలి. అతని తల్లి అక్కర్లేదు. ఈకాలం ఆడపిల్లలంతా ఇంతే అనుకుంటూ, "ఆవిణ్ని కాదని నువ్వు ఎలాగూ నెగ్గుకురాలేవు. పోనీ ఆవిణ్ని మెప్పించేట్లా కాస్త అణకువగా, కాస్త సోబర్‌గా ఉండవచ్చుగా" అన్నాను కాస్త బెదురుగానే.

ప్రశాంతి తెలివైనది. నా మంచితనం కనిపెట్టింది. కాస్త గొంతు తగ్గించి, "నిజం చెప్పనా అంకుల్! ఇది నా స్టయిల్ కానే కాదు. ఆవిణ్ని కావాలని రెచ్చగొట్టడానికే ఇలా ప్రవర్తిస్తున్నాను. ఎందుకంటారా? గోపాల్‌ని వాళ్ల అమ్మనుండి విముక్తుణ్ని చేయడానికి..." అంది.

నాకర్థం కాకపోతే విశదీకరించింది. "మృణాళిని గారు వాళ్ల అబ్బాయిని తన కొంగుచాటునే పెంచింది. అతనికి ఒక వ్యక్తిత్వం అంటూ లేకుండా చేసిపడేసింది. అతనెంతసేపూ, 'మా అమ్మకు ఇది నచ్చదు, అది నచ్చదు' అనడమే తప్ప తనకేం కావాలో తేల్చుకోలేదు. నా భర్త అలా ఉండడం నేను

భరించలేను. అత్తగారి మీద ద్వేషం ఏమీ లేదు. ప్రతీ మనిషికి తనకంటూ వెన్నెముక ఉండాలి. అది గోపాల్‌కి రావాలంటే వాళ్ల అమ్మతో అతను ఘర్షణ పడితీరాలి. అది నా కారణంగానే జరగాలి. తక్కిన ఏ విషయంలోనైనా అయితే అతను జావకారిపోతాడు."

"అంటే నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాడు కాబట్టి నీ కోసం తల్లినైనా ఎదిరించి ఇండివిజ్యువాలిటీ నిరూపించుకుంటాడనీ నీ అంచనా. బాగుంది. దానికోసం ఈ మోడ్రన్ వేషాలన్నీ ఎందుకు?"

"అవన్నీ ఉంటే తప్ప ఆవిడ నన్ను నిరసించదు. కొడుకుపై ఆంక్షలు పెట్టదు. తల్లీ కొడుకుల మధ్య ఘర్షణ రాదు, గోపాల్‌కి తనకు నచ్చినదాని కోసం పోరాడే అలవాటు రాదు. ఈజ్ ఇట్ క్లియర్, అంకుల్?"

క్లియరే గానీ, ఇలా ఆమె కావాలని అత్తగారితో పోట్లాటకు దిగితే మనం మాత్రం చేసేదేముంది? మృణాళిని గారితో తిరిగి చెప్పేందుకేముంది? పనాజీ చుట్టుపట్ల ఊళ్లు తిరగడానికి మర్నాడు పొద్దున్నే హోటల్ ఖాళీ చేసి వెళ్లిపోయాను, వీళ్లెవరినీ కలవకుండా.

నాలుగురోజుల తర్వాత తిరిగివచ్చేసరికి నా కంటికి ఒక అద్భుతమైన దృశ్యం కనబడింది. బీచ్ రెస్టారెంట్‌లోకి వచ్చి కాఫీకి ఆర్డరివ్వబోతూ ఇటు తిరిగి చూస్తే మృణాళిని, ఆమె పక్కన... సర్‌ప్రైజ్... ప్రశాంతి! అంతకంటే పెద్ద వింత – ప్రశాంతి కన్నీరు కారుస్తోంది, మృణాళి ఓదారుస్తోంది. నన్ను చూడగానే ఆవిడ పిలిచింది. "ఎక్కడికి వెళ్లిపోయారు?" అంటూ.

"అదే, ఊరెళ్లాల్సి వచ్చింది అర్జంటుగా. తిరిగివచ్చి వేరే హోటల్లో దిగాను. ఇంతకీ ఎలా ఉన్నారు?" అన్నాను పలకరింపుగా.

జవాబు ఆవిడ నుదురు కొట్టుకుంది. దానికి కారణం ఏమిటో రెండు నిమిషాల్లోనే అర్థమయ్యింది. గోపాల్ కొత్తగా చేసుకున్న గర్ల్‌ఫ్రెండ్!

వాళ్లిద్దరూ సముద్రంలో జలకాలాడి వచ్చారు. ఆ పక్కనున్న అమ్మాయి కాస్త నలుపే గానీ బ్రహ్మాండమైన ఫిగర్. బ్రహ్మాండమని ఎలా చెప్పగలవు అని అడగనక్కరలేదు. ఆ ఫిగర్‌ని దాచుకునే ప్రయత్నాలేమీ చేయలేదు ఆ అమ్మాయి. ఎంత స్విమ్మింగ్ డ్రస్సయినా మరీ అంత నామమాత్రంగా ఉండనక్కరలేదు.

ప్రశాంతి వేసుకునే జీన్స్‌కే మొహం చిట్లించే మృణాళిని గారు ఇలాటి డ్రస్సుకు ఎలా రియాక్టవుతుందో ఆమె మొహం చూడనక్కరలేకుండానే ఊహించవచ్చు. కానీ గోపాల్‌కి అదేమీ పట్టినట్టు లేదు. ఆమె పిరుదల మీదుగా చేయివేసి దగ్గరకి లాక్కుంటూ, "మీట్ మై ఫ్రెండ్ లైలా!" అంటూ నాకు పరిచయం చేసాడు.

"హాయ్, స్వీటీ!" అంటూ ఆమె నన్ను కౌగలించుకున్న తీరుకి నేనే కాదు, అక్కడున్న ఆడవాళ్లిద్దరూ కూడా సిగ్గుతో తలవంచుకున్నారు.

ఆ తర్వాత కూల్‌డ్రింక్స్ తాగుతూ ఆమె ఒళ్లు విరుచుకున్న తీరు, కాళ్లు టేబుల్ మీద పడేసి కూచున్న తీరు, ఆ తర్వాత తను బసచేసే హోటల్‌కి ఆ డ్రస్సుతోనే వెళ్లడానికి సిద్ధపడే తీరు – చూస్తే మృణాళినికే కాదు నాకూ కంపరం పుట్టింది. ప్రశాంతి కొరకొర చూస్తోంది లైలాకేసి. గోపాల్ కానీ, లైలా కానీ దాని గురించి ఖాతరు చేయలేదు. పైగా "ఆ అమ్మాయి ఒక్కత్తీ పాపం ఎలా వెళుతుంది? నేను వెళ్లి దింపి వస్తాను" అంటూ గోపాల్ బయలుదేరడం చూస్తే తన్నబుద్ధేసింది.

వాళ్లు అలా వెళ్లగానే మృణాళిని అంది, "చూసారా మా వాడి వరస!" అని.

చూశాను. కళ్లారా చూశాను. తల్లి కొంగు పట్టుకుని తిరిగిన కుర్రాళ్ల గతి ఇంతే! విచక్షణా జ్ఞానం నశించిపోతుంది. ప్రశాంతి కనబడగానే ఆమె వెంట పడ్డాడు. తల్లి వద్దన్నా ఖాతరు చేయలేదు. ఇప్పుడు ఈ గోవా అమ్మాయి లైలా ఒళ్లు చూపించగానే దాని వెంటపడ్డాడు. ఈ అమ్మాయిని కోడలిగా ఊహించుకుంటేనే చాలు మృణాళినికి పిచ్చెత్తిపోతుంది. ప్రశాంతే నయం అనిపిస్తుంది. కానీ టూ లేట్... మనవాడు గోపాల్ లైలా మీద వ్యామోహంలో తల మునకలుగా మునిగిపోయి వున్నాడు.

మృణాళిని పరిస్థితి చూస్తే నాకు జాలికంటె, నవ్వు ఎక్కువ వచ్చింది. ముఖ్యంగా ఆమె ప్రశాంతిని

ఓదార్చే తీరు. ఈ ఫీలింగ్స్ ముందే కనబరచివుంటే, ఆ అమ్మాయిని తమతో బాటు ఉంచుకుని ఉంటే ఈ ముప్పు వచ్చేదే కాదు. వాళ్లిద్దరినీ దూరంగా ఉంచడానికి ప్రయత్నించింది. మధ్యలో లైలా రావడంతో కథ అడ్డం తిరిగింది.

ప్రశాంతి తెలివైన అమ్మాయిని ఇదివరకే అనుకున్నాను. ఇప్పుడా అభిప్రాయాన్ని నిరూపిస్తూ కన్నీళ్లు తుడుచుకుని మృణాళినితో స్పష్టంగా చెప్పింది. "వాళ్లిద్దరి సంగతీ చూసారుగా. ఇక గోపాల్‌కి నేను చేరువ కావడం కల్ల. అతని లోకంలో లైలా తప్ప వేరెవరూ లేరు. ఎంగేజ్‌మెంట్ టైములో గోపాల్ ఇచ్చిన ఉంగరం ఇదిగో, అతనికిచ్చేయండి." అంటూ వేలికున్న ఉంగరం తీయబోయింది.

మృణాళిని అడ్డుపడింది. "అది తీసావంటే నా మీద ఒట్టే! గోపాల్ మరీ బరితెగించిపోతాడు. ఎప్పటికైనా నువ్వే నా కోడలివి. ఆ లైలా దెయ్యం వదిలితే తప్ప వీడు మనుష్యుల్లో పడడు" అంటూ.

ప్రశాంతిలో ఉవ్వెత్తున్న కోపం ముంచుకు వచ్చింది. "దాన్ని చంపితే గానీ నా కసి తీరదు. గోపాల్ నాకు దక్కకపోయినా ఫర్వాలేదు కానీ ఆ వగలాడిని ముక్కలు ముక్కలుగా కోసేయాలి" అంటూ అరిచింది.

"ఊరుకో అమ్మా, ఆవేశపడకు. దేవుడి దయవల్ల అంతా సవ్యంగానే జరుగుతుంది." అంటూ ఓదార్చింది పెద్దావిడ.

ఈ ఆడవాళ్ల గొడవలో మనం ఎందుకని సెలవు తీసుకుని అప్పటికి బయటపడ్డాను కానీ మర్నాటికి లైలా హత్య కేసులో ఇరుక్కున్నాను. అఫ్‌కోర్సు, సాక్షిగానేననుకోండి.

మర్నాడు పొద్దున్నే పోలీసుస్టేషన్‌కి పిల్చారు. లైలాను క్రితం రాత్రే ఎవరో పీక పిసికి చంపారుట. ఆమె రూముకి వచ్చి వెళ్లే గోపాల్ సమాచారం ఆసరాగా చేసుకుని, ప్రశాంతే లైలాను చంపివుంటుందన్న నిర్ధారణకు వచ్చారు పోలీసులు. లైలాను చంపుతానంటూ ప్రశాంతి ప్రతిజ్ఞ చేసిందా లేదా సాక్ష్యం చెప్పడానికి పిలిచారు నన్ను. నాకు తెలిసినది చెప్పి రూముకి వచ్చిపడ్డాను. నా వెనక్కాలే వచ్చాడు గోపాల్!

"అంకుల్! లైలాను ప్రశాంతి చంపలేదు అంకుల్! ఆ టైముకి ఆమె నాతోనే ఉంది." అంటాడతను.

"ఈ కాకమ్మ కథలన్నీ పోలీసులకు చెప్పవయ్యా, నువ్వూ, ప్రశాంతీ కలిసి అర్ధరాత్రి తిరగడం ఏమిటి? ఒక పక్క కొట్టుకుచస్తూనూ..." అంటూ విసుక్కున్నాను.

'అసలు కథ చెప్పకపోతే మీకు తెలియదు' అంటూ మొత్తం కథ చెప్పుకొచ్చాడు గోపాల్-గోపాల్, ప్రశాంతి కలిసి తిరుగుతూ మృణాళినిని చూసి తప్పుకుంటూంటే డిసౌజా అనే టూరిస్టు కంటబడ్డారట. ఏమిటయ్యా కథ అంటే విషయం చెప్పారట. అతనో ఐడియా చెప్పాట్ట. హ్యూమన్ సైకాలజీ ఇంతే. ప్రశాంతి కంటే మోడన్‌గా కనబడే అమ్మాయిని రంగంలోకి తీసుకువస్తే మీ అమ్మ ప్రశాంతిని ఎప్రూవ్ చేస్తుందని చెప్పాట్ట. 'లైలా అనే ఒక స్టేజ్ ఏక్ట్రెస్‌ను పంపుతాను, హెల్ప్ చేస్తుంది. తర్వాత ఏమైనా ముట్టచెప్పండి' అన్నాట్ట. దాని ప్రకారం నాటకం ఆడి రక్తి కట్టించారుట గోపాల్, ప్రశాంతి. అందువల్ల ప్రశాంతికి లైలా మీద కోపం ఉండే ప్రశ్నలేదుట. 'ఆ రాత్రి మేం ఇద్దరం కలిసి డిస్కోథెక్‌కి వెళ్లాం' అంటాడు గోపాల్.

"ఈ విషయం పోలీసులకు చెప్పవచ్చుగా!" అన్నాను విస్తుపోతూ.

"చెప్పచ్చు. ప్రశాంతి బయటకొస్తుంది కానీ మా పెళ్లి మాత్రం ఆగిపోతుంది. మేం ఇద్దరం కలిసి మోసం చేసేమని తెలిస్తే అమ్మ అగ్గిమీద గుగ్గిలం అయిపోతుంది. తన కోపానికే వెరుస్తున్నాననుకోకండి. ఆమె మనస్సు గాయపడినా నేను బాధపడిపోతాను. మీరేదైనా ఉపాయం చెప్పండి" అన్నాను.

"మీ అమ్మగారేమంటున్నారు?"

"ఏమీ అనటం లేదు. విషయం విన్న దగ్గర్నుంచి ఆమె మౌనంగా గదిలోనే కూచుంది. పలకరించినా పలకటం లేదు. ఒక హంతకురాలితో తన కొడుకు నిశ్చితార్థం అయినందుకు ఆమె బాధపడుతూ ఉండవచ్చు. పరిస్థితి ఎలా హేండిల్ చేయాలో నాకు తెలియటం లేదు."

నాకూ తెలియదు. అందుకనే ఆలోచించి రేపు ఏదైనా చెబుతాను అంటూ అతన్ని పంపేశాను. మర్నాడు పోలీస్‌స్టేషన్ నుండి నాకు పిలుపు రాలేదు. నేనే వెళ్లాను, ఏమయిందో కనుక్కుందామని. ఇన్‌స్పెక్టర్ హుషారుగా ఉన్నాడు. "సారీ సార్, మీకు అనవసరంగా ట్రబుల్ ఇచ్చాం. అసలు హంతకురాలు వచ్చి లొంగిపోయింది. ప్రశాంతిని వదిలేశాం" అన్నాడు.

"అసలు హంతకురాలు ఎవరుట?" అన్నాను తెల్లబోతూ.

"మృణాళినీదేవి. కొడుకుని తప్పు దారి పట్టిస్తోందన్న కోపంతో లైలాను చంపేసిందట. ఆవిడే ఒప్పేసుకుంది."

నాకు మతిపోయింది. ఆవిడ నిన్నటి మౌనాన్ని వేరేలా అర్థం చేసుకున్నాం గోపాల్, నేనూ. ఆవిడ వ్యక్తిత్వం పరికించి చూస్తే హత్య చేయడానికి కూడా వెనకాడని వ్యక్తిలాగానే అనిపించింది. వెళ్లి కలుస్తానంటే ఆవిడ ఎవర్నీ చూడడానికి ఇష్టపడటం లేదని అన్నాడతను.

మిస్టరీ విడిపోయిందన్న సంతోషంతో ఆ రోజు మధ్యాహ్నమే బొంబాయికి ప్రయాణమయ్యాను.

బొంబాయిలో దిగేక మా మామయ్యతో ఇదంతా చెబితే ఆయన నమ్మలేదు. మృణాళిని అసలు హంతకురాలు కాకపోవచ్చంటాడు ఆయన. పోలీసు ఫోర్సులో చేసి రిటైరయిన అనుభవంతో చెబుతున్నానన్నాడు. నేను మాత్రం నమ్మడానికి సిద్ధంగానే ఉన్నానన్నాను.

"అసలు ఆవిడ పొగరు ఎలాటిదో తెలుసా? తన కొడుకు తన మాట జవదాటడానికి వీల్లేదు. ప్రశాంతితో ఉన్నప్పుడు ఒకలా ఏడ్చాడు, లైలాతో చేరాక ఇక బొత్తిగా మాట వినడం మానేసాడు. దాంతో ఆవిడకు కసి పెరిగిపోయింది. కొడుకుని చంపలేదు కదా, లైలాను చంపి పారేసింది" అని వాదించేను.

"నీకు అలాటివాళ్ల దర్పం ఒక్కటే తెలుసు. కానీ మా అమ్మ కూడా అలాటిదే కాబట్టి వాళ్ల మనస్సులో ఎలా ఉంటుందో నేను ఊహించగలను. కావలసిన వాళ్ల కోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడగలరు వాళ్లు" అన్నాడు మామయ్య.

"ఇక్కడ కావలసిన వాళ్లెవరు?"

"ఇంకెవరు. కాబోయిన కోడలు ప్రశాంతి. ఆమె హత్య చేసిందన్న ఉద్దేశ్యంతోనే ఆ నేరాన్ని మృణాళిని తన నెత్తిమీదకు వేసుకుందని నా అనుమానం. ఆ సమయంలో ప్రశాంతి ఎక్కడుందో మనకు తెలుసు. ఆవిడకు తెలియదు. అందువల్ల అసూయతో ప్రశాంతి చంపి ఉంటుందని, ఆమెను కాపాడడానికే మృణాళిని జైలుకెళ్లుతోందని అనుకుంటున్నాను. హత్యాస్థలం దగ్గర మృణాళిని తాలూకు వస్తువులు ఏమైనా కనబడ్డాయా?" అన్నాడు మామయ్య సీరియస్‌గా.

"అంటే సిగరెట్ పీకలు, వేలిముద్రలూ అవీనా? మామయ్యా, పోలీసుల వాళ్ల దగ్గరికి వెళ్లి ఇవన్నీ అడిగే దమ్ము నాకు లేదు. గట్టిగా అడిగితే మన మీద కొస్తుంది అనుమానం. ఎందుకొచ్చిన తంటా?"

కానీ మామయ్య విడిచిపెట్టలేదు. నా చేత నాలుగుసార్లు అన్నీ చెప్పించుకున్నాడు. సందేహాలున్నచోట అడిగి తెలుసుకున్నాడు. చివరికి "ఆ పోలీసు ఇన్‌స్పెక్టర్ మాత్రే మన శిష్యుడే, అడిగి చూద్దాం" అంటూ ఫోన్ కొట్టాడు. శవాన్ని ఇప్పటివరకూ ఎవరూ గుర్తుపట్టలేదనీ, ఆమె గదిలో ఆమెకు సంబంధించిన కాగితాలేవీ దొరకలేదనీ చెప్పగానే ఆశ్చర్యపడ్డాడు. "ఫేమస్ స్టేజి ఏక్ట్రెస్ అన్నారు, ఆమె నెవరూ గుర్తుపట్టకపోవడమేమిటి?" అంటూండగానే ఏదో తట్టినట్టుంది.

ఫోన్ పెట్టేసి, నా కేసి తిరిగి, "గోపాల్‌కి ఫోన్ చేసి, అతనికీ సలహా చెప్పిన డిసౌజా అడ్రసు కనుక్కో" అన్నాడు.

కానీ గోపాల్ డిసౌజా అడ్రసు తెలియదుట. తమాషా ఏమిటంటే ఈ కేసు పోలీసులు టేకప్ చేయగానే ఎందుకైనా మంచిదని అతను బస చేసిన హోటల్‌కెళ్లి అడిగితే ఆ పేరు వాళ్లకు తెలియదనేసారట. మనిషి గుర్తులు వర్ణించి చెబితే 'బెనర్జీనా?' అంటూ బొంబాయి ఎడ్రసు ఒకటి ఇచ్చారుట. మామయ్య

దాన్ని నోట్ చేసుకోమన్నాడు.

'ఒన్స్ ఏ కాప్, ఆల్వేజ్ ఏ కాప్' అన్నారు. నేను వద్దులే మామయ్యా అన్నా వినకుండా నన్ను బెనర్జీ ఆఫీసు ఎడ్రసుకి లాక్కుపోయాడు, 'ఏమైనా లీడ్ దొరుకుతుందేమో చూద్దాం' అంటూ.

అక్కడ బెనర్జీ గారి దర్శనమే కాలేదు. ఎపాయింట్‌మెంట్ లేనిదే వారెవరినీ చూడరట. పోదామంటే విన్నాడు కాదు మామయ్య. ఎపాయింట్‌మెంట్స్ అన్నీ అయిపోయాక వీలుపడితే మాకు టైమిమ్మనండి అని సెక్రటరీకి చెప్పి కూచున్నాం.

అక్కడ కూచున్న గంటన్నరలోనూ, ఆఫీసు స్టాఫ్ ఎవరో ఒకరు రావడం ఆ సెక్రటరీని ఏదో అడగడం, ఆమె కాస్సేపు వెతకడం, తర్వాత 'లీలా వచ్చిన తర్వాత అడుగుదాంలే' అంటూండడం గమనించాం.

మధ్యలో ఏదో ఫోన్ కూడా వచ్చింది లీలా గురించి. "గోవా వెళ్లిందండి. పై వారం వచ్చేస్తుంది" అంది సెక్రటరీ. ఇక మామయ్య ఊరుకోలేదు. వెళ్లి సెక్రటరీని అడిగేశాడు. "మీరు పెర్మనెంటు సెక్రటరీ కాదా?" అని.

"కాదండి. నేను టైపిస్టుని. సెక్రటరీ లీలా అనే కొంకణి అమ్మాయి. సెలవు మీద గోవా వెళ్లింది. కాగితాలు ఎక్కడ పెట్టిందో కనబడి చావటం లేదు. అందరూ నన్ను తిట్టేవాళ్లే." అంది ఏడుపు మొహం పెట్టి.

"ఆ అమ్మాయి కాస్త నల్లగా, పొడుగ్గా ఉంటుందా?" అడిగేడు మామయ్య.

"అవును. ఎందుకలా అడుగుతున్నారు? మీకేమైనా కావాలంటే మా బాస్ బెనర్జీగార్నడగండి. వాళ్లిద్దరూ బాగా క్లోజ్" అంటూ కంగారుపడింది ఆ అమ్మాయి.

"ఆ అమ్మాయి ఫోటో చూపిస్తే ఏదైనా చెప్పగలుగుతా" అన్నాడు మామయ్య గుంభనగా.

వెతగ్గా, వెతగ్గా ఓ ఆఫీసు ఫంక్షన్ ఫోటోలో కనబడిందన్నారు. అది నాకిచ్చి గుర్తుపట్టమన్నాడు మామయ్య. లైలాను గుర్తుపట్టి చూపితే అదే లీలా అన్నారు.

"వాళ్ల ఆఫీసు స్టాఫ్‌ని పట్టుకుని స్టేజ్ ఏక్ట్రెస్ అని చెప్పాడేమిటి? ఆవిడ నాటకాలు కూడా వేస్తుందేమో!" అని నేను ఆశ్చర్యపడుతూండగానే "పద, పోదాం" అన్నాడు మామయ్య.

"అదేమిటి? అపాయింట్‌మెంట్?"

"అక్కర్లేదు. నాకు కేసు అర్థం అయిపోయింది. ఇంటికి పద" అంటూ ఆఫీసు బయటపడ్డాక చెప్పాడు మామయ్య – "ఈ బెనర్జీయే హంతకుడు. సెక్రటరీతో ఏదో ప్రేమకలాపాలు నడిపివుంటాడు. ఆమె బ్లాక్‌మెయిల్ చేసి ఉంటుంది. గోవాలో గోపాల్ తగలగానే వీడికి అయిడియా వచ్చి ఉంటుంది. గోపాల్‌కి తప్పుడు పేరు చెప్పాడు. లీలాకు ఏదో కథ చెప్పి, డబ్బు ఆశ చూపి లైలాగా మార్చి పంపేడు. ఓ రోజు రాత్రి పనాజీ వెళ్లి లీలాను చంపేసి, కామ్‌గా వచ్చేసాడు. అనుమానం ప్రశాంతి మీదనే పోతుందని కరెక్టుగానే అంచనా వేశాడు."

బయటకు రావడం, పోలీసులకు ఫోన్ చేయడం, అరెస్టు వారంటు తీసుకుని వాళ్లు బెనర్జీ ఆఫీసుకు చేరడం సాయంత్రానికల్లా అయిపోయింది.

రెండురోజులు తిరక్కుండా బెనర్జీ నేరం ఒప్పుకోవడం, మృణాళిని విడుదల కావడం, గోపాల్ కోరికపై పోలీసులు మృణాళిని వద్ద కొంత సమాచారం దాచడం, ఆవిడ శోకంలో నుండి బయటకు వచ్చి వీళ్ల పెళ్లికి సమ్మతించడం జరిగింది.

నాకూ మా మామయ్యకూ కూడా రానుపోనూ టిక్కెట్లు కొని పంపారు. పెళ్లి ఆహ్వానంతో బాటు.